క్లుప్తంగా

రైతు సమస్యల పరిష్కారానికి కృషి



ఊట్కూరు: రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భారతీయ కిసాన్‌సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు బాలప్ప అన్నారు. ఆదివారం పెద్దజట్రంలో బీకేఎస్ ఆధ్వర్యంలో గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రెండు లక్షలు రుణమాఫీ చేస్తామని ఇప్పటివరకు మాఫీ చేపట్టలేదని ఆరోపించారు. రైతుబంధు 5 ఎకరాలవారికి ఇప్పటివరకు ఖాతాలో జమా కాలేదని ఆరోపించారు. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో వరి పంట వేసిన రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని ప్రభుత్వం వెంటనే నష్టపరిహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. గ్రామ అధ్యక్షుడిగా నీరటి అంజప్ప, ఉపాధ్యక్షుడిగా కొండప్ప, నాగప్ప, కార్యదర్శిగా మాల లక్ష్మణ్, బాలరాజు, కార్యవర్గ సభ్యుడిగా బొలప్ప, సోమప్పను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు వడిఅప్ప, మూపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడి ఇఫ్తార్



అమరచింత: పట్టణ జామీయ మసీదులో ఆదివారం పిన్నంచర్లకి చెందిన సీపీఐ నాయకుడు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాబర్ట్ ఆధ్వర్యంలో ఉపవాస దీక్ష పరులకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం తమవంతుగా రోజా పాటించే వారికి పండ్లను ఇచ్చి ఇఫ్తార్ ఇవ్వడం జరుగుతుందని, ఈ సారి అన్ని రకాల పండ్లను జామీయ మసీదు మౌలానాకు అందించి ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించామని చెప్పారు. కార్యక్రమంలో జామియా మసీదు కమిటీ సభ్యులతో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రతి హామీ నెరవేరుస్తాం



దేవరకద్ర: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం వెంకటాయపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీల నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలలో మహిళలకు ఉచిత బస్సు, ఆరోగ్యశ్రీ కింద రూ. 10 లక్షల వైద్య సేవలు అమలు చేశారని వివరించారు. గత నెల 27 న రూ. 500 లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలు అమలు చేశారని తెలిపారు. అయిదవ గ్యారంటీ అయిన పేద మధ్య తరగతి ప్రజల సొంతింటి కల అయిన ఇందిరమ్మ ఇండ్ల పథకానికి భద్రాద్రి శ్రీరాముల వారి సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారని తెలిపారు. త్వరలో రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీని ఆదరించి ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో మాజీ ఎంపీపీ భారతిరెడ్డి, నాయకులు వీరేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంజల్‌రెడ్డి, కొకుంట్ల అధ్యక్షులు రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాజీ వైస్ ఎంపీపీ చేరిక...

వెంకటాయపల్లి గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ, మాజీ సర్పంచ్ రంగయ్యగౌడ్ బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముదిరాజ్ సంఘం అధ్యక్షులు నక్కరఘు, నాయకులు విశ్వేశ్వర్‌రెడ్డి, శివయాదవ్, చెన్నయ్య, బాలరాజు, ఆంజనేయులుతో పాటు మరో 200 మంది సైతం పార్టీ తీర్థ పుచ్చుకున్నారు.

ఘనంగా మట్టల వేడుకలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని కల్వరి మెన్నోనైట్ బ్రదరన్ చర్చీ కౌన్సిల్ ఆధ్వర్యంలో పాం సండే (మట్టల ఆదివారం) వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ఈతమట్టలతో ఊరేగింపు శాంతి ర్యాలీ నిర్వహించారు. ముందుగా కల్వరి చర్చి ప్రధాన ద్వార నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీని పాతబస్టాండ్, క్లాక్‌టవర్, అశోక్‌టాకీస్ చౌరస్తా, ఆర్టీసీ బస్టాండ్, తెలంగాణ చౌరస్తా మీదుగా క్రీస్తు గీతాలు ఆలపిస్తూ కొనసాగించారు. భారీ సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు. ఎంబీ చర్చి చైర్మన్, సీనియర్ పాస్టర్ రెవరెండ్ ఎస్.వరప్రసాద్, వైస్ చైర్మన్ బీఐ.జేకబ్, కార్యదర్శి జేఐ.డేవిడ్, కోశాధికారి టీపీ.స్టీవెన్, సహ కోశాధికారి టైటస్ రాజేందర్, సంఘ కార్యవర్గం పాల్గొన్నారు.



శిథిల కల్వర్టులతో ముప్పు

- ఏళ్లు గడుస్తున్నా మరమ్మతుకు నోచుకోని వైనం
- పేట నుంచి మరికల్ వరకు లెక్కకు మించి కల్వర్టులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



కల్వర్టు గుంతలో పడ్డ కారు(ఫైల్)



అప్పంపల్లి శివారులో రోడ్డుకు సమాంతరంగా ఉన్న కల్వర్టు

మరికల్: జిల్లాలో శిథిలమైన కల్వర్టులు రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. ఏళ్లు గడుస్తున్నా మరమ్మతుకు నోచుకోలేకపోతున్నాయి. ఈ విషయం తెలిసిన పీఆర్, ఆర్‌అండ్‌బీ శాఖలు నిద్ర మత్తును వీడటం లేదు. మరిన్ని ప్రమాదాలు జరగక ముందే అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. జిల్లాలో 1,551.5 కిలోమీటర్లు ఆర్‌అండ్‌బీ రహదారి ఉంది. వీటికి తోడు 104.8 కిలో మీటర్లు జాతీయ రహదారి జిల్లా మీదుగా వెళ్తుంది. మరికల్ నుంచి నారాయణపేట వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారి మీదుగా ఉన్న కల్వర్టులు శిథిలమైపోయాయి. గతంలో ప్రమాదాలతో దెబ్బతిన్న రక్షణ గోడల్ని మరమ్మతులు చేయకపోవడంతో ఇప్పుడు నామరూపాలు లేకుండా పోయాయి. తారురోడ్డుకు సమాంతరంగా తయారయ్యాయి. మక్తల్ నుంచి నారాయణపేట వయా ఊట్కూర్, నారాయణపేట నుంచి కోస్గి వయా దామరగిద్ద, మద్దూరు పరిధిలోని రోడ్డులోని కల్వర్టులు మరమ్మతులకు వచ్చాయి. పీఆర్ రోడ్డులో కల్వర్టులతోపాటు మలుపులు ఉన్న చోట హెచ్చరిక బోర్డులు సైతం లేవు. ఇవన్నీ రోడ్డు ప్రమాదాలకు కారణాలవుతున్నాయి. ఇకనైనా పీఆర్, ఆర్‌అండ్‌బీ శాఖాధికారులు కల్వర్టుల మరమ్మతులపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇటీవల జరిగిన ప్రమాదాలు..

మరికల్ నుంచి నారాయణపేట మధ్యన అనేక ప్రమాదకార కల్వర్టులు ఉన్నాయి. తరచుగా వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్న సంబంధిత అధికారుల్లో చలనం లేదు. ఈ నెల 6న మరికల్ మండలం అప్పంపల్లి గ్రామ శివారులో ఉన్న కల్వర్టు ముళ్లపొదలో ఉండటంతో నారాయణపేట నుంచి వస్తున్న కారు అదుపు తప్పి కల్వర్టు గుంతలో బోల్తా పడింది. కారులో ఉన్న ఆరుగురు స్వల్ప గాయలతో బయట పడ్డారు. ఇక్కడ కల్వర్టు ఉన్నట్లు తెలియకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని అప్పంపల్లి గ్రామస్తులు తెలుపుతున్నారు. ఇదే కల్వర్టు వద్ద పదిమందికి పైగా మృత్యువాత పడ్డారు. అలాగే నారాయణపేట మండలం చిన్నజట్రం, పెద్దజట్రం మధ్యలో ప్రమాదకర కల్వర్టు ఉంది. ఇక్కడ రోడ్డుకు ఇరువైపుల కల్వర్టు నిర్మించారు. రెండు వైపుల రక్షణ గోడలు ధ్వంసం కావడంతో తారురోడ్డుకు సమాంతరంగా కల్వర్టు మారింది. దీంతోపాటు ధన్వాడ కొత్త మసీద్, అంత్వార్ మందిపల్లి, శివారుల్లో శిథిలమైన రోడ్డుకు సమాంతరంగా మారాయి. ఈ కల్వర్టుల వద్ద ప్రతి నెల రెండు, మూడు ఘటనలు జరుగుతునే ఉంటాయి.

టెండర్లకు పిలుస్తున్నాం..

మరికల్ నుంచి నారాయణపేట వరకు శిథిలవస్థకు చేరిన కల్వర్టుల నిర్మాణాలకు ఇప్పటికే నాలుగు సార్లు టెండర్లు పిలిచాం. బిల్లులు రావని కాంట్రాక్టర్లు ఎవరూ ఈ పనులు చేయడానికి ముందుకు రావడం లేదు. మరోసారి టెండర్ పిలవాలని అధికారులు ఆదేశిస్తే ఆ దిశగా చర్యలు తీసుకుంటాం.

– విష్ణు, ఆర్‌అండ్‌బీ ఏఈ

హోలీ ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

నారాయణపేట రూరల్ : హోలీ పండుగను ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని, బలవంతంగా ఎవరిపైనా రంగులు చల్లొద్దని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం విలేకరులతో మా ట్లాడుతూ.. పట్టణం, మండలంలోని గ్రామాల్లో ఇతరులకు ఇబ్బందులు కల్గించేవిధంగా, మహిళలపై అసభ్యంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. బలవంతంగా డబ్బులు వసూలు చేయడం, వీధుల్లో ఇష్టారీతిగా బండలు, కుండలు వంటి వస్తువులు పగలగొట్టడం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రసాయనాలతో కాకుండా ప్రకృతిసిద్ధంగా లభించే రంగులతో హోలీ జరుపుకోవాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని గ్రామాలు, పట్టణాల్లో పోలీసు పెట్రోలింగ్ కొనసాగుతుందని, సీసీ కెమెరాల్లో నమోదు జరుగుతుందని యువత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. బావులు, చెరువుల వద్ద నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, ర్యాష్ డ్రైవింగ్ చేయరాదన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కొనసాగుతాయన్నారు.

మక్తల్: హోలీ పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీఐ చంద్రశేఖర్ యువత, మండల ప్రజలకు సూచించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.. హోలీ పండగను సురక్షితమైన రంగులను వాడాలని, హోలీ అనంతరం చెరువుల్లో, లోతట్టు ప్రాంతాల్లో స్నానాలు ఆచరించే క్రమంలో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలన్నారు. వాహనాలు నడిపే క్రమంలో నిబంధనలకు అనుగుణంగా డ్రైవింగ్ చేయాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కనిపెడుతూ జాగ్రత్తలు పాటించేలా చూడాలన్నారు. సమావేశంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

అమరచింత: హోలీ పండుగను మతసామరస్యంతో ప్రతిఒక్కరూ ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ సురేష్ కుమార్ తెలిపారు. సోమవారం హోలీ సందర్భంగా యువకులు రహదారులపై విచ్చిలవిడిగా తిరుగుతూ ఇతరులకు ఇబ్బందులు కలుగజేయకుండా పండుగను జరుపుకోవాలన్నారు. మద్యం తాగి ద్విచక్ర వాహనాలను రహదారులపై తిప్పుతూ ప్రజలకు ఇబ్బందులు పెడుతున్న వారిపై చర్యలు తప్పవన్నారు. బావులు, చెరువుల్లో ఈతకు వెళ్లి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని సూచించారు.

జబ్బార్‌ను పరామర్శించిన నాయకులు



నారాయణపేట రూరల్: సీపీఎం పార్టీ వనపర్తి జిల్లా కార్యదర్శి జబ్బార్‌ను పేట జిల్లా నాయకులు పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన జబ్బార్ హైదరాబాద్‌లోని నిమ్స్‌ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక నాయకులు జీ.వెంకట్రామారెడ్డి, గోపాల్, అంజిలయ్యగౌడ్, బలరాం కలుసుకుని ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ప్రపంచ శాంతి కోరుతూ ప్రార్థనలు



మస్జిదేనూర్‌లో ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లింలు

ఆత్మకూర్: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లిం సోదరులకు ఆదివారం రాత్రి స్థానిక మసీదే నూర్‌లో, మస్జిదే సయ్యదీయాలో సనా ఫొటో స్టుడియో ఆధ్వర్యంలో పూలహమీద్ కుమారుల ఆధ్వర్యంలో ఇఫ్తార్‌ను వేర్వేరుగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మౌలాన అబ్దుల్‌అలీంరశాది, హఫీజ్ అజ్హర్‌అలీ ప్రపంచశాంతి కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు తౌఫిక్, అయ్యూబ్, జుబేర్, ఇంతియాజ్, ఖయ్యూం, నవీద్, రియాజ్ అలీ, అజ్హర్, అన్వర్, జహంగీర్, మాసూం, సాదీఖ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మహబూబ్‌నగర్ రూరల్: దివిటిపల్లిలో నూతనంగా నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కాలనీలో అభివృద్ధి పోరాట వేదిక నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా సురేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కడియాల మోహన్‌లు ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగ తాటికొండ రాములు, ఉపాధ్యక్షులుగా అంబదాస్, వర్ద గాలన్న, రాజ్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా గడ్డమీది గోపాల్, ప్రశాంత్, వెంకటేష్‌గుప్తా, యాదగిరి, సలహాదారులుగా నల్లవెల్లి కురుమూర్తి, కేశవులు, రామ్మోహన్, రాఘవేందర్‌గౌడ్, కోశాధికారిగా రవిశంకర్, ఉప కోశాధికారిగా వాజేందర్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ కాలనీలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. రాఘవేందర్‌యాదవ్, ఆది విష్ణువర్ధన్, నరేష్, యాదయ్య, సంజయ్‌కుమార్, భానుప్రసాద్, జహంగీర్, నవాబ్‌ఖాన్, శశి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

దారిచూపని బోర్డులు

- గ్రామాల్లో కానరాని సూచిక బోర్డులు
- కొన్ని గ్రామాల్లో తుప్పపట్టి నిరుపయోగంగా..
- దారి తెలియక ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



గురువలింగంపల్లి-తళంకేరికి దారి చూపే సూచిక బోర్డు ఇలా..

మాగనూర్: ప్రయాణికుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేస్తున్న సూచిక బోర్డులు తుప్పు పట్టిపోతున్నాయి. ఏళ్ల తరబడి వాటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో బోర్డులు ఏర్పాటు చేసిన ప్రయోజనం లేకుండా పోయింది. మండల పరిధిలో ఏర్పాటు చేసిన సూచిక బోర్డుల్లో కొన్ని తుప్పుపట్టిపోతుండగా, మరికొన్ని రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదల్లో ఉండి కనిపించడం లేదు. దీంతో మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రయాణికులు అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతున్నారు.

తప్పని తిప్పలు..

మండల పరిధిలోని వర్కూర్- నేరడగం, నేరడగం-ఉజ్జెల్లి, నేరడగందొడ్డి-బైరంపల్లి గ్రామాల మధ్య అదేవిధంగా వడ్వాట్- అడవిసత్యరం, అమ్మపల్లి-పర్మన్‌దొడ్డి, కొల్పూర్-మందిపల్లి, పూంజనూర్, ఇటు గురువలింగంపల్లి- తళంకేరి, కొత్తపల్లి గ్రామాలకు ఎన్నో ఏళ్లక్రితం సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు బోర్డులకు రంగులు వేసి గ్రామాల పేర్లు రాయించిన దాఖలాలు లేవు. దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు సూచిక బోర్డులు కానరాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో దారి తప్పి ఇతర గ్రామాలకు వెళ్తున్నారు. ముఖ్య కూడళ్లలోని బోర్డులు నాలుగైదు ఏళ్ల క్రితమే రంగులుపోయి తుప్పుపట్టాయి. వీటికి మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సమస్య పరిష్కారం కాలేదు. రోడ్డుపక్కన పాఠశాలల గేట్ల వద్ద ఏర్పాటు చేసిన సూచిక బోర్డులను కూడా గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీంతో పాఠశాల వద్ద సూచిక బోర్డులు లేక గ్రామస్తులు రోడ్డుపై మట్టికుప్పలు పోసి తాత్కాలిక స్పీడ్‌బ్రేకర్లను ఏర్పాటు చేసుకున్నారు.

బోర్డులు ఏర్పాటు చేయాలి..



కొత్తపల్లి పాఠశాల ప్రధాన రోడ్డు పక్కనే ఉండటంతో నిత్యం విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారుల దృష్టికి ఈ విషయం తీసుకువెళ్లిన ఫలితం లేకుండా పోయింది. అధికారులు ఇప్పటికైనా స్పందించి బోర్డులు ఏర్పాటు చేయాలి.

- కాళప్ప కొత్తపల్లి

ఇబ్బందులు తొలగించాలి..



మండల వ్యాప్తంగా పలు గ్రామాలకు సూచిక బోర్డులు లేక మండలానికి కొత్తగా వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. సమయంతోపాటు రవాణా ఖర్చులు వృథా అవుతున్నాయి. అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటుచేసి ఇబ్బందులు తొలగించాలి.

- నాగరాజు, వడ్వాట్

సమస్య పరిష్కరిస్తాం..

ప్రతి ఒక్కటి లేదా రెండు సంవత్సరాలకు ఇలాంటి వాటికి మరమ్మతులు చేయడం, కొత్తవి ఏర్పా టు చేయాల్సిన బాధ్యత సదరు రోడ్డు కాంట్రాక్టర్లకు ఉంటుంది. అయితే వారు నిర్లక్ష్యం చేస్తున్నారు. సూచిక బోర్డులకోసం ప్రతిపాదనలు పంపించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

- దర్మరాజు, పంచాయతీరాజ్ ఏఈ,

ప్రజల భద్రత కోసమే ఫ్లాగ్‌మార్చ్



పాథర్చేడ్‌లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

నర్వ: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకే ప్రజల భద్రత కోసం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నామని ఎస్ఐ కురుమయ్య అన్నారు. ఆదివారం మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన రాయికోడ్, పాథర్చేడ్ గ్రామాల్లో సాయుధ పోలీస్ బలగాలచే ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ప్రధాన వీధుల గుండా కవాతు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. జరగనున్న పార్లమెంట్ ఎన్నికలో ప్రజల భద్రత కోసం భరోసా కల్పించేందుకు లోకల్ పోలీస్‌లతో పాటు సాయుధ బలగాల కవాతు చేపట్టామన్నారు. ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ కురుమయ్య, సాయుధ బలగాల ఇన్‌చార్జి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంను కలిసిన కాంగ్రెస్ నాయకులు



సీఎం రేవంత్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

మద్దూరు: మద్దూరు, కొత్తపల్లి మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఆదివారం సీఎం రేవంత్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మద్దూరు జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, పార్టీ నాయకులు తిరుపతిరెడ్డి, రమేష్‌రెడ్డి కలిసిన వారిలో ఉన్నారు. ఉమ్మడి మద్దూరు మండలానికి సంబంధించిన ప్రతి అభివృద్ధి పనులను తన దృష్టికి తీసుకొచ్చి మంజూరు చేయించుకోవాలని సూచించినట్ల వారు పేర్కొన్నారు.

ప్రమాదకరంగా మలుపులు



పెదిరిపాడ్ చెరువు కట్ట వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు

మద్దూరు: మద్దూరు నుంచి పెదిరిపాడ్ మీదుగా నారాయణపేట వెళ్లే రోడ్డులో పెదిరిపాడ్ చెరువు కట్ట వద్ద ఉన్న మలుపు ఉండటంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ఈ రోడ్డు గతంలో మోటల్‌రోడ్డు ఉండేది. 11ఏళ్ల క్రితం ఆర్ అండ్‌బీ నిధులతో ఈ రోడ్డును బీటీగా మార్చారు. నారాయణపేటకు వెళ్లేందుకు దూరం తగ్గుతుండడంతో ఈ దారిలో వెళ్లేందుకు వాహనదారులు మొగ్గుచూపుతున్నారు. ఈ రోడ్డు మలుపు వద్ద ప్రమాద సూచికలు, స్పీడ్ బ్రేక్‌లు ఏర్పాటు చేయకపోవడంతో తరుచు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కాముడి దిష్టిబొమ్మ ఊరేగింపు



పట్టణంలోని బీసీ కాలనీలో కాముడి శవయాత్ర



జగన్‌వాడలో కాముడి దిష్టిబొమ్మతో పాడె ముందు రోధిస్తున్న యువకుడు

అమరచింత: కాముడి పూర్ణిమను పురస్కరించుకుని పట్టణంలోని జగన్‌వాడ, బీసీ కాలనీలో ఆదివారం కాముడి దిష్టిబొమ్మతో శవయాత్రను పట్టణ పురవీధుల వెంట నిర్వహించారు. ఆయా వార్డులకు చెందిన యువకులు, చిన్నారులు కాముడి దిష్టిబొమ్మను తయారు చేసి వాటిని పాడెపై పడుకోబెట్టి ఊరేగించారు. పాడె ముందు మహిళ వేషధారణతో ఆయ్యో నా మొడుగు చనిపోయాడమ్మ దహన ఖర్చులకు సాయం చెయ్యండమ్మా అంటూ ఏడుస్తూ డబ్బులను వసూలు చేశారు. వీటిని పోగు చేసి కాముడిని దహనం చేస్తూ.. గుగ్గిళ్లను అదే మంటలో ఉడకబెట్టి వాడంతా పంచడం ఆనావాయితీగా వస్తుందని యువకులు తెలియజేశారు.

కాముడి దహనం



కాముడి దహనంలో పాల్గొన్న యువకులు

ఆత్మకూర్: రంగు రంగుల హోలీ వేడుకలను సోమవారం జరుపుకోనున్నారు. ఆదివారం ఆత్మకూర్‌లోని నేతాజీనగర్, కేషవస్వామి నగర్‌లో యువకులు, చిన్నారులు కాముడి దిష్టిబొమ్మను ఊరేగించారు. చెన్నస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల వద్ద అగ్నిగుండాలను ఏర్పాటు చేసి కాముడి దహనం చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

అమరచింత: మండలంలోని నాగల్ కద్మూర్‌లో 2005–06 విద్యాసంవత్సరంలో ఎడో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమేళనం నిర్వహించారు. అప్పట్లో గ్రామంలో ఏడో తరగతి వరకే ప్రభుత్వ పాఠశాల ఉండటంతో ఉపాధ్యాయులు బోధించిన విషయాలను చక్కగా నేర్చుకొని తమ జీవితాల్లో స్థిరపడ్డామన్నారు. ఈ మేరకు అప్పట్లో తమకు చదువు నేర్పిన గురువులను సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ జ్ఞాపకాలను ఒకరి తర్వాత ఒకరు పంచుకుంటూ సరదాగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు అందించిన పాఠశాలకు తమ వంతు సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.కురుమన్న, చంద్రశేఖర్, నజీర్ అహ్మద్, కె.నర్సింహులు, రవికుమార్ , రాము, నాగరాజు పాల్గొన్నారు.

బీజేపీ పార్టీలో చేరిన నాయకులు

పాలమూరు: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చెందిన తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాసులు, 18వ వార్డు కౌన్సిలర్ కిషోర్‌కుమార్ ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ అభ్యర్థి డీకే అరుణ తదితరులు పాల్గొన్నారు.